రోడ్డు పనులు రయ్‌రయ్

- వేగంగా గాండ్లగూడెం- నక్కర్తమేడిపల్లి రహదారి విస్తరణ
- ఐదు కిలోమీటర్ల రోడ్డులో 700 మీటర్ల మేర సీసీ, మిగితాది బీటీ
- పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.6 కోట్ల నిధులు మంజూరు


విస్తరణకు నోచుకోనున్న యాచారం-నక్కర్తమేడిపల్లి రోడ్డు

యాచారం: నక్కర్తమేడిపల్లి రోడ్డుకు మహర్దశ పట్టనుంది. ఇన్నాళ్లు ఇరుకుగా ఉన్న ఈ రహదారి విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. యాచారం నుంచి గాండ్లగూడెం మీదుగా మల్కీజ్‌గూడ, నక్కర్తమేడిపల్లి, కడ్తాల్ మండలం పల్లెచల్కతండా, సరికొండ మీదుగా ఆమనగల్లు వరకు ఈ మార్గం కొనసాగుతుంది. మూడు మండలాల సరిహద్దును కలిపే ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

18 అడుగుల రోడ్డు విస్తరణ

యాచారం నుంచి గాండ్లగూడెం మీదుగా నక్కర్తమేడిపల్లి వరకు ఉన్న 12 అడుగుల రోడ్డును 18 అడుగులకు విస్తరించనున్నారు. 5 కిలోమీటర్ల మేర ఉన్న రహదారి విస్తరణ కోసం రూ.6 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో యాచారం నుంచి గాండ్లగూడెం వరకు 350 మీటర్ల మేర, మల్కీజ్‌గూడలోని కల్వర్టు వద్ద మరో 350 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించనున్నారు. మిగిలిన చోట బీటీ రహదారి నిర్మిస్తారు.

ఫ్యూచర్ సిటీని దృష్టిలో పెట్టుకుని

ఫ్యూచర్‌సిటీని దృష్టిలో పెట్టుకుని యాచారంలోని సాగర్ రోడ్డు నుంచి నక్కర్తమేడిపల్లి వరకు 18 అడుగుల రోడ్డును విస్తరిస్తున్నట్లు తెలుస్తోంది. నక్కర్తమేడిపల్లిలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్(అద్దె భవనంలో) ఏర్పాటు చేయడం, సమీపంలోని భూములన్నీ ఫార్మాసిటీ కోసం సేకరించినవే కావడంతో తరచూ టీజీఐఐసీ, రెవెన్యూ శాఖల అధికారులు ఈ రూట్‌లో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సులభ ప్రయాణం కోసం ప్రస్తుతం 18 అడుగులుగా విస్తరించి, ఆతర్వాత 36 అడుగుల రహదారి నిర్మాణానికి నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చేపట్టిన పనులు చురుగ్గా కొనసాగుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ప్రమాదాలు తగ్గుతాయి



యాచారం నుంచి నక్కర్తమేడిపల్లి వరకు ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. కారులో వెళ్లేవారు ఎదురుగా మరో వాహనం వస్తే పక్కన ఆపాల్సి వచ్చేది. విస్తరణ పనులు పూర్తయితే ప్రమాదాలు తగ్గుతాయి. – ఆడాల గణేశ్, నక్కర్తమేడిపల్లి

భవిష్యత్తులో మరింత విస్తరణ



రోడ్డు విస్తరణకు రూ.6 కోట్ల నిధులు మంజూరయ్యాయి. భవిష్యత్తులో ఈ రహదారిని మరింత విస్తరించే అవకాశం ఉంది. రోడ్డు వెడల్పు పనులకు రైతులు, ప్రజలు సహకరించాలి. నక్కర్తమేడిపల్లి చెరువు కట్టను సైతం విస్తరిస్తాం. – సిద్దార్థ్, పీఆర్ ఏఈఈ

ఎన్టీఆర్‌కు ఘన నివాళి


ఇబ్రహీంపట్నం: నివాళులర్పిస్తున్న నేతలు

ఆమనగల్లు: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. టీడీపీ నాయకులు కొప్పు యాదయ్య, కండె భాస్కర్, జంగయ్య, జగన్, సత్తయ్య, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో నిర్వహించిన రక్తదానం శిబిరంలో కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జ్ యాదీలాల్ రక్తదానం చేశారు.

ఇబ్రహీంపట్నం: దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం ఇబ్రహీంపట్నంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చెరువు కట్టపై గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప్పరిగూడ పీఏసీఎస్ డైరెక్టర్ అశోక్‌తో పాటు టీడీపీ శ్రేణులు వీరాచారి, కప్పరి అంజయ్య, గరిగ వెంకటేశ్, ఇబ్రహీం, జాంగీర్‌లు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: తుర్కయంజాల్‌లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రావుల వీరేశం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందర్, చక్రధర్, శ్రావణ్‌కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.


తుర్కయంజాల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

క్లుప్తంగా

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


వేడుకల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానించిన నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాల్లో శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం ఆయనను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


కడ్తాలలో అన్నదానం

ఆమనగల్లు: లయన్స్ క్లబ్‌ల ద్వారా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. క్లబ్ సభ్యుడు గంప శ్రీను తల్లి వీరమణి వర్ధంతి సందర్భంగా శనివారం బస్టాండ్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, స్థానిక నాయకులు జోగు వీరయ్య, లాయక్ అలీ, లయన్స్‌క్లబ్ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీ పాష తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో యువత భాగస్వామ్యం పెరగాలి


ఎమ్మెల్యే నుంచి నియామక పత్రం అందుకుంటున్న శివయాదవ్

మంచాల: కాంగ్రెస్ పార్టీలో యువత భాగస్వామ్యం పెరగాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి యువ సేనా మండల అధ్యక్షుడిగా ఎంపికైన ఆస్మత్‌పూర్ గ్రామానికి చెందిన మంతని శివయాదవ్‌కు శనివారం ఆయన నియామక పత్రం అందజేశారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌చారి, బైరిక రమాకాంత్‌రెడ్డి, చీమల జంగయ్య పాల్గొన్నారు.

లైంగికదాడి ఘటనపై సీపీఐ నిరసన


ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలో బాలికపై జరిగిన లైంగిక దాడిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు పి.విజయలు పేర్కొన్నారు. ఈ మేరకు ఘటన జరిగిన హోటల్ ఎదుట శనివారం నిరసన వ్యక్తంచేశారు. నిబంధనలు పాటించని యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

మంచాల: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) 2025 క్యాలెండర్‌ను శనివారం మంచాల మండల కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాందాస్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, ఉదారి నర్సింహ, మండల అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి రవిందర్, నాయకులు వెంకటేశ్, బాలరాజు,దత్తాత్రేయ,జంగయ్య, మహేష్, వెంకటయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు


మైసిగండిలో క్రికెట్ టోర్నీ విజేతకు షీల్డు అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ అమలు చేస్తోందని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని ఆయన కోరారు. మైసిగండిలో నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ విజేతలకు శనివారం ఆయన బహుమతులు అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన స్టార్ టీమ్‌కు రూ.30 వేలు, షీల్డు, రెండో స్థానంలో నిలిచిన ఎఎస్ఆర్ టీమ్‌కు రూ.16 వేలు, నగదు బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్‌నాయక్, హీరాసింగ్ నాయక్, శేఖర్‌గౌడ్, రెడ్యనాయక్, తులసీరాంనాయక్, రాజేశ్, బిక్కు, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కోనాపూర్‌లో ముగిసిన టోర్నీ..

మండల పరిధిలోని కోనాపూర్‌లో నాలుగు రోజులుగా నిర్వహించిన క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సురిగి మహేశ్, సురిగిమల్ల శేఖర్, ఈదమయ్య, రమేశ్, మల్లేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, మామిడిపల్లి, మొదళ్లగూడ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తించేందుకు అధికారులు చేపడుతున్న సర్వేను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయన్నారు. గత ప్రభుత్వం కేవలం ఉచిత, ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విడతల వారీగా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పాత జాతీయ రహదారి చంద్రయాన్‌గూడ నుంచి మామిడిపల్లి గ్రామం వరకు రూ.30 కోట్లతో రోడ్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. దివ్యాంగుల సౌకర్యార్థం షాద్‌నగర్ పట్టణంలో త్వరలో సదరం క్యాంపును ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మామిడిపల్లిలో సీసీరోడ్డు, మజీద్‌మామిడిపల్లి గ్రామంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు జంగ నర్సింహ, నవీన్‌గౌడ్, రాజుగౌడ్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, రాంరెడ్డి, కుమారస్వామిగౌడ్, మల్లేశ్, అన్వర్, ప్రభాకర్, వెంకటచారి, సీతారాం, కృష్ణ, ఎంపీడీఓ సుమతి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్.. అబద్ధాలు మానుకో

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్


షాబాద్‌లో రైతు దీక్ష చేసిన స్థలాన్ని కల్లాపి చల్లి శుభ్రం చేస్తున్న నాయకులు

షాబాద్: కేటీఆర్ అబద్ధపు మాటలు, ప్రజలను మోసం చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో కేటీఆర్ నిర్వహించిన రైతు దీక్ష, ధర్నా నిర్వహించిన సభ స్థలంలో చీపుర్లతో శుభ్రం చేసి కల్లాపి చల్లి నేలను శుద్ధి చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ప్రతి రైతుకు రైతు భరోసాగా ఎకరాకు ఏటా 12 వేల రూపాయలు అందిస్తామన్నారు. 25 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని హామీనిచ్చారు. గతంలో ఎప్పుడు లేని విధంగా విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిందన్నారు. అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శులు గౌరీ సతీష్, ఎస్.రాంరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ చేసిన తప్పులను కప్పిపుచ్చుకుంటూ ఉనికిని కాపాడుకునేందుకు దొంగదీక్షలు చేస్తున్నారని వాటిని మానుకోవాలని సూచించారు. గత 10 ఏళ్లలో నిరుద్యోగులను వీధిన పడేశారని విమర్శించారు. 200ల యూనిట్ల వరకు ప్రతి ఇంటికి ఉచిత కరెంటు, 500ల రూపాయలకే గ్యాస్ కనెక్షన్లు, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చల్లా మాధవరెడ్డి, హస్మత్‌పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అక్తర్‌పాషా, యాదయ్య, షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, పామెన నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్ రామ్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సురేష్, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మల్లేశ్, నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, అశ్వక్‌అలీ, బాల్‌రాజ్, బాస నర్సింహులు, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో లబ్ధిదారుల ఎంపిక సభలు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదిబట్ల మున్సిపాలిటీలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21, 22 తేదీల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. 21న ఉదయం 10గంటలకు 1,9,10 వార్డులకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో, 5,6,7,8,14 వార్డులకు సంబంధించి కొంగరకలాన్ లైబ్రెరీలో సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 22వ తేదీన 2,11 వార్డులకు సంబంధించి బొంగ్లూర్ వార్డు కార్యాలయంలో, 13,15 వార్డులకు పటేల్‌గూడ వార్డు కార్యాలయంలో, 4,12 వార్డులకు సంబంధించి మంగళ్‌పల్లి వార్డు కార్యాలయం, 3వ వార్డుకు రాందాస్‌పల్లి కార్యాలయంలో వార్డు సభలు కొనసాగుతాయన్నారు. అర్జీదారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి


బాలికల హాస్టల్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణంరాజు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి గేటు సమీపంలో ప్రైవేట్ హాస్టళ్లలో బాలికలకు శనివారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బాలికలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అల్లరి మూకలపై అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు దురదృష్టకరమన్నారు. ర్యాగింగ్, ఈవిటీజింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. హస్టల్లో ఉండే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర సమయంలో 100 నంబరుకు కాల్ చేయాలనిసూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం

యాచారం: ఫ్యూచర్‌సిటీలో భాగంగా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరిస్తే ఊరుకునేది లేదని వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన భూ సేకరణ గ్రామాలైన మర్లకుంట, మంగలిగడ్డతండా, కుర్మిద్దలో పర్యటించారు. నింబంధనల ప్రకారం భూ సేకరణ చేస్తే బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నా రు. శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 27 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు ఆరోగ్య భద్రత పెరిగిందన్నారు. చెక్కులను మంజూరు చేసినందుకుగాను సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

మైసిగండి ఆలయానికి రూ.5 కోట్లు

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- అమ్మవారికి ప్రత్యేక పూజలు


మైసిగండి మైసమ్మ ఆలయంలో పూజలలో ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: మైసిగండి ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెల్లడించారు. మైసమ్మ దేవాలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీ పంతునాయక్, ఈఓ స్నేహలత, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శనివారం అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్వకుర్తి అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఆలయానికి మంజూరైన నిధులతో సీసీ రోడ్డు, కార్యాలయ భవనం, పలహారశాల నిర్మాణం తదితర పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడురి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, తహసీల్దార్ జ్యోతి, ఆలయ నిర్వాహకుడు రామావత్‌భాస్కర్, నాయకులు శేఖర్‌గౌడ్, సూదిని కొండల్‌రెడ్డి, గౌరవరం ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకే రైతు భరోసా


షాద్‌నగర్‌రూరల్: గూగుల్ మ్యాప్‌లో భూముల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతుభరోసా పథకంలో సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా అందుతుందని మండల వ్యవసాయాధికారి(ఏఓ) నిషాంత్‌కుమార్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, చౌలపల్లి, చింతగూడ, మధురాపూర్ గ్రామాల్లో ఏఓ రెవెన్యూ అధికారులతో కలిసి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వ్యవసాయం చేసేందుకు అనువుగా ఉన్న భూములకే రైతు భరోసా అందిస్తుందన్నారు. వ్యవసాయ యోగ్యంకాని భూములను రైతు భరోసా జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లోని భూములను గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తిస్తున్నామని, వాటన్నింటి వివరాలను గ్రామంలో నిర్వహించే గ్రామసభలలో చర్చించి ప్రజల ఆమోదం తీసుకుంటామన్నారు. వ్యవసాయేతర భూములుగా మార్చిన వాటికి రైతు భరోసా పథకం వర్తించదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు సలీం, రోజారాణి, ఏఈఓలు తేజ్‌కుమార్, ప్రణీత, రాంబాబు, మహేందర్‌గౌడ్, గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

మొయినాబాద్‌రూరల్: వ్యవసాయ యోగ్యం కాని భూములను పరిశీలిస్తున్నామని తహసీల్దార్ గౌతమ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నమంగళారం, వీరన్నపేట్, కనకమామిడి గ్రామాల్లో అధికారులు వ్యవసాయ యోగ్యం కాని భూములను పరిశీలించి నమోదు చేశారు. ఈ సందర్భంగా చిన్నమంగళారంలో మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ రైతులతో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా కనకమామిడిలో మండల వ్యవసాయాధికారి రైతులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా కార్యక్రమంలో రైతులకు సంబంధించిన భూములను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. సాగుకు పనికి రాని భూములను పథకం నుంచి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజిత్ రెడ్డి, ఏఓ ప్రవీణ్, సునీల్, చిన్నమంగళారంలో మండల సర్వేయర్ జలజ, ఏఓ కుమార్, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఆలేటి ఎల్లయ్య

హస్తినాపురం: జీహెచ్‌ఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మనెంట్ చేయాలని రంగారెడ్డి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 22న జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం హస్తినాపురం చౌరస్తాలో జీహెచ్‌ఎంసీ కార్మికులతో కలిసి ధర్నాకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించి రెండో పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. బయోమెట్రిక్ హాజరు పట్టికలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని అన్నారు. జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని హైకోర్టు తీర్పు ప్రకారం పర్మనెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్లకు రూ.35 వేల వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, భాగ్యలక్ష్మీ, రేణుక, ముత్తమ్మ, చంద్రమ్మ, ముత్యాలమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.